వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు


పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


మక్కపేటలో బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు


పెనుగంచిప్రోలులో అమ్మవారి విగ్రహ ఊరేగింపు

జగ్గయ్యపేట అర్బన్ : శరన్నవరాత్రి మహోత్సవాలు జగ్గయ్యపేటలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో వేద పండితులు బ్రహ్మశ్రీ మహంకాళి రామప్ప ఆధ్వర్యంలో ఉదయం కలశస్థాపన, అనంతరం శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో అమ్మవారికి కలశ స్థాపన, గోపూజ, లక్ష్మీగణపతి, చండీ మూలమంత్రసహిత శ్రీమహాలక్ష్మి హోమాలు నిర్వహించారు. దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, కలశస్థాపన, శ్రీచక్ర కుంకుమ పూజ, చండీహోమం నిర్వహించారు. అమ్మవారు శ్రీరజిత కవచాలంకృత దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చెరువుబజారులో ఉన్న శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో , అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారు ఆదివారం బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గౌరవరంలో అమ్మవారిని అర్చకులు మార్తి శివరామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో బాలత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకమార్చనలు చేశారు. బలుసుపాడు గురుధాంలో తాత్వికుడు గెంటేల వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో వేదపండితులు, అర్చకులు వేద పఠనం, పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై శ్రీకనదుర్గమ్మ అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజ చేశారు. వేద పండితులు సూర్యనమస్కారాలు ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఉమాపతి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తూర్పుబజారులో శ్రీదుర్గామల్లేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారిని భక్తులు ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. శ్రీస్వయంభు లింగేశ్వరస్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆయా ఆలయాల్లో కూడా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభించారు. తొలుత అమ్మవార్లను గ్రామాల్లో ఊరేగించి మండపాల్లో నిలిపి పూజలు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : దేవీ శరన్నవరాత్రులు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వత్సవాయి, దబ్బాకుపల్లి, మక్కపేట, చిట్టేల, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు, కంభంపాడు తదితర గ్రామాల్లోని ప్రధానవీధులలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేశారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. నవరాత్రులను వైభవంగా జరుపుకునేందుకు భక్తులు పందిళ్లను అందంగా సుందరంగా అలంకరించారు. అమ్మవారి మండపాల వద్ద మహిళలు బతుకమ్మలను తయరుచేసి ఆడిపాడారు. పందిళ్ల వద్ద ఎటువంటి గొడవలకు తావులేకుండా నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ అభిమన్యు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు చేశారు. అల్లూరులోని సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరు భాస్కరరావు, మంగపతిరావు ఆధ్వర్యంలో అమ్మవారు, స్వామివారికి విశేష పూజలు చేశారు. జుజ్జూరు గ్రామంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో కనక దుర్గాదేవికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గండేపల్లిలో అర్చకులు కాటా నరసింహారెడ్డి స్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో, వివిధ రకాల పుష్పపత్రాలతో మండపాలు ఏర్పాటు చేశారు. 50మంది భక్తులు దుర్గాదేవి మాలలు ధరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. కంచికచర్లలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దుర్గమ్మకు భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు.నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.

నందిగామలో..

నందిగామ: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, సామూహిక కుంకుమార్చనలతోపాటు పలు రకాల హోమాలు నిర్వహించారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు రజత కవచాలంకృతాలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, అంకురార్పణ పూజలు నిర్వహించారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరీగా అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. దుర్గానగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు రజత కవచాలంకృతాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లగిరి గట్టుపైగల త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. నందిగామ పట్టణంలోని పలు కూడళ్లు, అనాసాగరం, మండలంలోని ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన చలువ పందిళ్లకు అమ్మవార్లను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్టించి పూజలు చేశారు.


పేట అద్దాలబజారులో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు


సత్యమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వామి


నందిగామ వాసవి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


అల్లూరులో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు


గండేపల్లిలో బాలాత్రిపురసుందరీగా అమ్మవారు


నందిగామలో మేళతాళాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు


శ్రీరజిత కవచాలంకృత దుర్గాదేవి అలంకరణలో..


బలుసుపాడు గురుధాంలో అమ్మవారు

క్లుప్తంగా

నేడు వైద్యశిబిరాలు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మండలంలోని గండ్రాయి, పెనుగంచిప్రోలు మండలంలోని ముండ్లపాడు, కంచికచర్ల మండలంలోని కీసర గ్రామాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు రమేష్‌బాబు, ఎస్‌వీ ప్రసాద్, కానూరు శిల్ప తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొనే ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవోలు కోరారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వేలాది మంది తరలి వచ్చారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

గుండెపోటుతో ఎంపీహెచ్‌ఏ మృతి

పెనుగంచిప్రోలు: గుండెపోటుకు గురై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(ఎంపీహెచ్‌ఏ)గా పనిచేస్తున్న సంకు సురేష్(42)మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య కూడా స్థానిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తోంది. సురేష్ మృతదేహాన్ని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైద్యులు పి.ఇందిర, సుజని,ఎన్. అనిల్‌కుమార్, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.సురేష్ కుటుంబసభ్యులను ఓదార్చి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పుస్తక ప్రదర్శన



నందిగామ: దసరా సెలవును పురస్కరించుకుని పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

పుస్తకాలు వితరణ



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించి, ఆయనకు నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట చైర్మన్ మోహన్‌బాబు విద్యార్థులకు ఉపయోగపడే 20 పుస్తకాలను గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. అబ్దుల్‌కలాంకు నివాళులర్పించిన వారిలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రాజాకేశవప్రసాద్, కృష్ణమూర్తి, క్లబ్ ప్రతినిధులు ఖాసిం సైదా, నారాయణరెడ్డి, ఎస్‌వీ.సత్యనారాయణ, హనుమంతరావు, అమరనాద్, వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ ఉన్నారు.

కన్నులపండువగా బతుకమ్మ ఉత్సవాలు



జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీవరదరాజస్వామి వారి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలకు మహిళలు, బతుకమ్మ కమిటీ సభ్యులు పూజలు చేశారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.

గుడిమెట్ల సమీపంలో బల్లకట్టు సీజ్

నందిగామ(చందర్లపాడు): మండలంలోని గుడిమెట్ల సమీపంలో కృష్ణానదిలో ప్రయాణం సాగించే బల్లకట్టును ఏసీపీ జనార్దన్ నాయుడు ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్వాహకులు అనుమతిపత్రాలు చూపించకపోవడంతో బల్లకట్టును సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. బల్లకట్టు నిర్వాహకులు అనుమతిపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఏసీపీ వెంట ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

జగనన్న పాలనలో గడప గడపకి మేలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


తుర్లపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): రాష్ట్రంలో గడప గడపకు మంచి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం తుర్లపాడులో ఆదివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తన పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 87శాతం గృహాలకు మంచి చేశారని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రతి కుటుంబానికి మేలు చేసేలా పాలన సాగుతోందని వివరించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు రాష్ట్ర మంత్రివర్గంలో సైతం ప్రాధాన్యతనిచ్చారన్నారు. బీసీలను గత ప్రభుత్వాలు ఓటుబ్యాంకుగా చూస్తే, సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రం బ్యాక్‌బోన్ క్యాస్ట్‌గా భావించి మంత్రి పదవులతోపాటు ఉపముఖ్యమంత్రి పదవిని సైతం కట్టబెట్టారని కొనియాడారు. గడపగడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చే ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి చేయడం కోసం పరితపించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరింత అండగా ఉండాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు పెరమసాని నరసింహారావు, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్‌కలాంకు ఘననివాళులు


అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు


అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నందిగామ టౌన్: బాలిస్టిక్ క్షిపణి, వాహన ప్రయోగ టెక్నాలజీ అభివృద్ధికి డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ శాస్త్రవేత్తగానే కాకుండా రాష్ట్రపతిగా డాక్టర్ అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. అబ్దుల్‌కలాం జీవితం నేటియువతకు ఆదర్శప్రాయమని సూచించారు. కలాంకు నివాళులర్పించినవారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, ఓర్సు జ్వాలా, మన్నెం దాసు, బండారు వెంకట్రావ్, కమతం వెంకటరెడ్డి, బాపట్ల సాంబయ్య, గద్దె రమేష్, చిలుకూరి బుచ్చిరెడ్డి, యాకుబ్‌అలీ, జాఫర్ ఉన్నారు.

అబ్దుల్‌కలాం జీవితం ఆదర్శప్రాయం

జగ్గయ్యపేట అర్బన్: భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జగ్గయ్యపేట బీజేపీ నాయకులు కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదాడరోడ్‌లోని అబ్దుల్ కలాం విగ్రహానికి బీజేపీ నాయకులు గోలి రాఘవేంద్రరావు, పెనుగొండ రామకృష్ణ, చిట్టూరు సైదాబాబు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నేటి యువత, విద్యార్థులు అబ్దుల్‌కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో శాస్త్రవేత్తగా భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచదేశాలకు చాటిన గొప్పవ్యక్తి డాక్టర్ అబ్దుల్‌కలాం అన్నారు. రాష్ట్రపతిగా అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిమ్మసర్తి శ్రీనివాసరావు, మేడూరి వెంకటేశ్వరరావు, వేద సుబ్రహ్మణ్యం, పసుపులేటి శ్రీకృష్ణ, ధనుంజయవర్మ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

22వరకు బతుకమ్మ ఉత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఈనెల 14న ప్రారంభమైన బతుకమ్మ ఉత్సవాలను అక్టోబర్ 22వతేదీ వరకు ఆయా ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు బతుకమ్మ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు ఆదివారం తెలిపారు. 15న శ్రీవరదరాజస్వామి ఆలయం, 16న శ్రీముత్యాలమ్మ ఆలయం, 17న పెద్ద శివాలయం, 18న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, 19న నకాశిబజారులోని శ్రీకనకదుర్గ ఆలయం, 20న శ్రీచెన్నకేశవ ఆలయం, 21న శ్రీరంగనాయకస్వామి ఆలయం, 22న చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయని వారు వివరించారు. ప్రతిరోజు సాయంత్రం ఐదుగంటల నుంచి ఆయా దేవాలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తారని, ఈ వేడుకల్లో మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కమిటీ ప్రతినిధులు నోముల శివకుమార్, యర్రా శ్రీనివాసరావు, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

నందిగామ: పేకాట శిబిరంపై నందిగామ పోలీసులు ఆదివారం దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పండుదొర కథనం మేరకు.. నందిగామ పట్టణ శివారు చందాపురం బైపాస్ సమీపంలో పేకాడుతున్నట్లు అందిన పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.7,350 నగదు, ఆరు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి చర్యలు


చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమెల్యే జగన్‌మోహనరావు, నాయకులు

చందర్లపాడు(నందిగామ టౌన్): మత్స్యకారుల సంక్షేమం, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన చేప పిల్లలను చందర్లపాడు మండలం బబ్బెళ్లపాడు, చింతలపాడు చెరువుల్లో ఆదివారం ఆయన వదిలారు. చింతలపాడు చెరువుకు 37,500, బబ్బెళ్లపాడు చెరువుకు 1,87,500చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా అందజేసిందని ఎమ్మెల్యే వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్‌లు షేక్ జానీ, మోహన్‌రెడ్డి, వైఎస్ఎస్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గురువులను సత్కరిస్తున్న కొణకంచి పాఠశాల పూర్వ విద్యార్థులు

● తీపి జ్ఞాపకాలు..మధురానుభూతులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక నలబోతు రామనాథం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సుమారు 43 ఏళ్ల కిందట పదోతరగతి చదువుకున్న 1979-80 బ్యాచ్ పూర్వవిద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాల కిందట కలసి చదువుకున్న 70మంది విద్యార్థులంతా ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనందోత్సహాలను పంచుకున్నారు. నాటి మిత్రులను మళ్లీ కలుసుకుంటామని అనుకోలేదని పలువురు చెమర్చిన కళ్లతో ఆనందభాష్పాలు కార్చారు. నాడు తమకు పాఠాలు చెప్పిన గురువులను సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. దేశంలో పలుచోట్ల స్థిరపడిన మిత్రులను ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ చెరుకూరి రంగయ్య, సినీ, టీవీ నటుడు ధనియాల రాధాకృష్ణ తెలిపారు.

భార్యపై గొడ్డలితో దాడి


బాధితురాలు సావిత్రిని పరామర్శించి ఘటన వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ జనార్దన్

నందిగామ(చందర్లపాడు): భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన ఘటన చందర్లపాడు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని తుర్లపాడుకి చెందిన వేల్పుల నాగరాజు ఆయన భార్య సావిత్రి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో భర్త నాగరాజు భార్యపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రురాలిని ఏసీపీ జనార్దన్‌నాయుడు పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను విజయవాడకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.